## సంస్మరించుకుందాం

**2024 మార్చి 23**
**కా॥ కానూసన్యాల్**
**14వ వర్ధంతి**

# నగ్జల్బరీ రైతాంగ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ కానూసన్యాల్‌కు అరుణారుణ జోహార్లు



**2010** మార్చి 23న మరణించిన భారత విప్లవోద్యమ విశిష్ట నాయకుడూ, నగ్జల్బరీ ఉద్యమ నిర్మాత, సిపిఐ(ఎం-ఎల్) మాజీ ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ కానూసన్యాల్ 81 సం॥ల తన జీవితంలో ఆరు దశాబ్దాలపైగా కాలాన్ని క్రియాశీల ప్రజాఉద్యమ రాజకీయాలకే అంకితం చేశారు. 1948లో తొలిసారి అరెస్టు అయిన మొదలు, ఉద్యమ జీవితంలో ఆయన 14 సం॥ల కాలం జైలుజీవితం, మరెన్నో సం॥ల కాలం రహస్య జీవితం గడిపారు. 1967 నాటి నగ్జల్బరీ రైతాంగ తిరుగుబాటుకు తన సహచరులతోకూడి నిబద్ధతతో, నిలకడగా కా॥ కానూ సన్యాల్ నిర్మాణ కృషి సాగించారు. కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన మిత, అతివాదాలను తిరస్కరిస్తూ ఆ ప్రాంతంలోని భూస్వాములకు వ్యతిరేకంగా భూమిహీనులను, పేద రైతాంగాన్ని సంఘటితపరచి మెట్టుమెట్టుగా అభివృద్ధిచేస్తూ నిర్మించిన పోరాటమే నగ్జల్బరీ రైతాంగపోరాటం.

1970ల నాటికి నగ్జల్బరీ, శ్రీకాకుళ గిరిజనోద్యమాలు ప్రభుత్వాల క్రూరనిర్బంధాలకు గురయ్యాయి. ఎందరో విప్లవ నాయకులను, రైతాంగ, గిరిజనోద్యమ ముద్దుబిడ్డలను పోలీసులు కాల్చిచంపారు. ఈ ఉద్యమాల నాయకత్వంలో తలెత్తి పైచేయి సాధించిన అతివాదం రెండు గొప్ప ప్రజా ఉద్యమాలను నిలదొక్కుకోనీయలేదు. ఉద్యమాలు వెనకపట్టుపట్టినా, సుదీర్ఘకాలం జైలు జీవితం గడపవలసి వచ్చినా కామ్రేడ్ కానూ సన్యాల్‌లో విప్లవచేవ ఇసుమంతైనా సడలలేదు. జైలు జీవిత కాలంలోనే మితవాద, అతివాదాలకు వ్యతిరేకంగా ఆయన ప్రారంభించిన సిద్ధాంత, రాజకీయ పోరాటాన్ని, జైలు నుండి విడుదలైన పిదప మరింత పట్టుదలగా కొనసాగించారు. విప్లవకారుల ఐక్యతకోసం తపించారు; సూత్రబద్ధ కృషి సాగించారు. 2005లో వివిధ విప్లవ సంస్థలు ఐక్యమై సిపిఐ(ఎం-ఎల్)గా ఏర్పడటం ఆయనకు నూతనోత్సాహాన్ని ఇచ్చింది. కామ్రేడ్ కానూసన్యాల్ నాయకత్వంలో రూపొందించబడిన ఐక్యతా విధానాన్ని చేబూని సిద్ధాంత, రాజకీయ, ఉద్యమ నిర్మాణరంగాల్లో సిపిఐ(ఎం-ఎల్) కృషిసాగిస్తోంది. కామ్రేడ్ కానూసన్యాల్ అందించిన విశిష్ట విప్లవ వారసత్వాన్ని కొనసాగించటానికి పార్టీ, ఉద్యమ కార్యకర్తలంతా పూనిక వహించటమే ఆయనకు అర్పించే అసలైన నివాళి.

* * * * *